క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కడప కార్పొరేషన్: కడప విద్యుత్ డివిజన్ పరిధిలో ప్రతి నెల రెండవ శనివారం జరిగే విద్యుత్ లైన్లు, 33/11 కేవీ ఉప కేంద్రాలలో మరమ్మత్తులు జరుగుతున్న దృష్ట్యా ఈనెల 9వ తేది కడప టౌన్, ఈస్ట్ రూరల్ సెక్షన్, రిమ్స్ సెక్షన్, చింత కొమ్మ దిన్నె, పెండ్లిమర్రి, మండలం, నందిమండలం, చెన్నూర్, వల్లూరు, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందని కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కడప పట్టణంలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో భాగంగా ఈనెల 9వ తేదీ రెండో శనివారం కింద కనపరిచిన ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని కడప టౌన్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. లక్ష్మానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ముత్రాస్ పల్లి, రెడ్డి కాలనీ, పకీరుపల్లి, ఓం శాంతి నగర్, అబ్దుల్ కలాం కాలనీ, చిన్న చౌక్ విద్యా మందిర్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతి బార్, ద్వారకా నగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సిపి బ్రౌన్, మున్సిపల్ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండు, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

మితిమీరిన వేగంతో ప్రమాదం



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జావీద్

కడప ఎడ్యుకేషన్: మితిమీరిన వేగం ప్రమాదమే కాదని ప్రాణనష్టం కూడా కలిగిస్తుందని కడప ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జావీద్ అన్నారు. శుక్రవారం కడప నగరంలోని శ్రీ వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో రహదారి భద్రత.. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ డి.కె.జావీద్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించటం కేవలం చట్టానికి లోబడే కాదని అది మన భద్రత కోసం, మన కుటుంబాల భద్రత కోసం అన్నారు. మితి మీరిన వేగం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్స్ ఇవన్నీ ప్రమాదాలకే కాదు, ప్రాణ నష్టం వరకు తీసుకెళ్లే మార్గాలు అని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ ఓట్లతో అధికారం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: భారతీయ జనతా పార్టీ, కేంద్ర ఎన్నికల సంఘం కుమ్మక్కై దొంగ ఓట్ల తో 2024 ఎన్నికల ఫలితాలను తారుమారు చేసి కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజమెత్తారు. శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ రాజధాని ఢిల్లీలో లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సాక్ష్యాధారాలతో సహా 2024 ఎన్నికల్లో సుమారు 25 లోక్‌సభ స్థానాల్లో కేంద్ర ఎన్నికల సంఘం, భారతీయ జనతా పార్టీ కుమ్మక్కై దొంగ ఓట్ల ద్వారా ఆ పార్టీకి ఎక్కువ స్థానాలు లభించేటట్లు చేశారని విమర్శించారన్నారు. అందువల్ల వెంటనే కేంద్ర ప్రభుత్వాన్ని భారత రాష్ట్రపతి బర్త్ రఫ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయానా రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సయ్యద్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి



చెళ్ళపిళ్ల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రచయితల సంఘం ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్: తిరుపతి వెంకట కవులుగా ప్రసిద్ధులైన దివాకర్ల తిరుపతి శాస్త్రి, చెళ్ళపిళ్ల వెంకట శాస్త్రి రాసిన 'పాండవోద్యోగం 'నాటకం లో పద్యాలు ఆంధ్రదేశమంతా మారుమోగాయని వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. శుక్రవారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో చెళ్ళపిళ్ల వెంకట శాస్త్రి 156 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మూల మల్లికార్జునరెడ్డి, తెలుగు అధ్యాపకులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడారు. వెంకట శాస్త్రి రచనలను వివరించారు. ఈ సందర్భంగా 'పాండవోద్యోగం' నాటకంలో పాత్రలు పోషించి పేరు సంపాదించుకున్న చాకల సుబ్బరాయుడు, అక్కల చంద్ర ప్రసాద్ లను సత్కరించారు. కార్యక్రమంలో రంగస్థల కళాకారులు హార్మోనిస్టు యడవల్లి రామలింగయ్య, దేవరశెట్టి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వరలక్ష్మీ వ్రత పూజలు



దేవుని కడపలో భక్తులకు సౌభాగ్యం పంపిణీ చేస్తున్న ఆలయ అధికారులు



వరలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీ విజయదుర్గా దేవి



విజయదుర్గమ్మ సన్నిధిలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు

కడప సెవెన్ రోడ్స్: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని కడప నగరంలోని శ్రీ విజయదుర్గ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు వరలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మహిళలు తరలి వచ్చి భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. ఆలయ అర్చకులు వ్రతాన్ని మంత్ర జపం ద్వారా భక్తులతో చేయించారు. వ్రత అనంతరం ఆలయ నిర్వాహకులు అమ్మవారి కాసు, కంకణం, కంకుమ, ప్రసాదాన్ని అందజేశారు. వరలక్ష్మీ వ్రతం నేపధ్యంలో అమ్మవారికి తెల్లవారు జామున అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం 10 గంటలకు వరలక్ష్మీ వ్రతం, సుమంగళి పూజ జరిగాయి. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించారు. శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం, దీపాలంకార సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు తరలిరావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

దేవుని కడపలో..

వరలక్ష్మీ వ్రత పూజలను శుక్రవారం కడప నగరంలో మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వైష్ణవ ఆలయాలను దర్శించి విశేష పూజలు నిర్వహించారు. దేవుని కడప శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయంలో ప్రత్యేక సందడి నెలకొంది. దైవ దర్శనానికి వచ్చిన మహిళలకు తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్తంగా సౌభాగ్యం పేరిట గాజులు, పసుపు, కుంకుమ, అక్షింతలు, పసుపు దారాలు, కంకణాలు, శ్రీ పద్మావతి అమ్మవారి లక్ష్మీ అష్టోత్తర శత నామావళి పుస్తక ప్రసాదాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఓ అజ్ఞాత భక్తుడు ఇందుకోసం 8 లక్షల గాజులు, 1.40 లక్షల కంకణాలు, 1.40 లక్షల పసుపు దారాలు, 1.40 లక్షల అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు, పుస్తక ప్రసాదాలను విరాళంగా సమర్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

- వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న ఆంధ్ర, తెలంగాణలోని 51 ఆలయాల్లో మహిళలకు ఈ సౌభాగ్యం పంపిణీ చేసినట్లు తెలిపారు. సౌభాగ్యం పంపిణీ కార్యక్రమాన్ని దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి పర్యవేక్షించారు. శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా కూడా దేవుని కడప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

నేడు శ్రావణ పౌర్ణమి

కడప సెవెన్ రోడ్స్: కడప నగరంలో శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గడ్డి బజారులోని శ్రీ లక్ష్మీ సత్య నారాయణ స్వామి దేవస్థానంలో సామూహిక వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారం పర్య అర్చకులు కె. విజయ్ భట్టర్ తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి ప్రారంభం కానున్న వ్రతంలో భక్తులు పాల్గొనాలని కోరారు. శ్రావణ శుద్ధ పౌర్ణమి శనివారం రావడం చాలా విశేషంగా భావిస్తారు. హిందూ సంప్రదాయం ప్రకారం శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమిని రాఖీ పౌర్ణమిగా, రక్షా బంధన్‌గా పేర్కొంటారు.

పొలతలలో భక్తుల సందడి



పొలతలలో వరలక్ష్మీ వ్రతంకు హాజరైన మహిళా భక్తులు

పెండ్లిమర్రి : పొలతల శైవక్షేత్రంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానం నందు శ్రావణ శుక్రవారం వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ఆలయ ఈఓ కృష్ణానాయక్ సమక్ష్యంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం వేడుకలు నిర్వహించారు. వేదపండితులు వరలక్ష్మీ వ్రతం విశిష్టత గురించి మహిళలకు వివరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వ్రతంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కమలాపురం : కమలాపురం పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు.



పొలతలలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న వేదపండితులు

ముమ్మరంగా ప్రచారం



పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా ఈ కొత్తపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



చంద్రగిరి ఎన్నికల ప్రచారంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు



ఈ కొత్తపల్లెలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పార్టీ నేతలు



ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ఈ కొత్తపల్లెలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి, పార్టీ నేతలు

పర్మిట్ రూంలకు అనుమతి వద్దు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మద్యం తాగేందుకు షాపుల వద్ద పర్మిట్ రూంలకు అనుమతి ఇవ్వవద్దని రాయలసీమ మహిళా సంఘం రాష్ట్ర కమిటీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తస్లీమ్, లక్ష్మీదేవిలు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వారు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం మహిళలకు మరిన్ని కష్టాలు తెచ్చేదిగా ఉందన్నారు. . ఇప్పటికే నిబంధనలకు నీళ్లొదిలి అనేక ప్రాంతాల్లో జాతీయ రహదారులు, బడి, గుడి మసీదుల దగ్గరలో షాపులు పెట్టారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ఇప్పుడు వైన్ షాపులకు అక్కడే మద్యం సేవించేందుకు పర్మిట్ రూములు ఇవ్వడం కారణంగా మరిన్ని కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో రోడ్డున పడతాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకొవాలన్నారు. తెల్ల కార్డు ఉన్న ప్రతి పేదవాడికి రేషన్ షాపుల ద్వారా 16 రకాల నిత్యావసర సరుకులు అందించాలని వారు ప్రభుత్వానికి సూచించారు.

ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ట్రామా సెంటర్ ను ఏర్పాటు చేయాలని కడప జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షుడు వివేకానంద రెడ్డి డిమాండ్ చేశారు. అత్యవసర సమయంలో రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులు కడప రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్తుంటే తిరుపతికి లేదా కర్నూలుకి తీసుకుని వెళ్లాలని చెబుతున్నారన్నారు. అదే ట్రామా సెంటర్ కడపలో ఉంటే ఎంతో మంది ప్రాణాలు కాపాడుకుంటారన్నారు. శుక్రవారం న్యాయవాది శ్రీనివాసులరెడ్డి కడపలో ఉన్న న్యాయవాది సుధాకర్ బాబ్జి దగ్గర పని చేస్తూ గోటూరు వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారన్నారు. 108 ద్వారా రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్తే రిమ్స్ ఆసుపత్రిలోని అత్యవసర విభాగ సిబ్బంది ఇక్కడ మాకు ఈ వైద్యంకు సంబంధించి సదుపాయాలు లేవని సమాధానం ఇచ్చారన్నారు. గత్యంతరం లేక తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆయన మరణించారని పేర్కొన్నారు. అత్యంత అనుభవం కలిగిన రిమ్స్ వైద్యులు అన్ని సదుపాయాలు కల్పిస్తే ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ట్రామా సెంటర్ ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ప్రస్తుత పాలకులు దీని పై దృష్టి సారించాలని కోరారు.

మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 30, 31 వ తేదీలలో కడపలో జరగనున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ వేదిక కానుందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య, యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి సుభాషిణి తెలిపారు. నగరంలోని హోచిమిన్ భవన్ లో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు చాముండేశ్వరి, హేమ, రమీజాబీ, వేదవతి, అన్నమయ్య జిల్లా కన్వీనర్ రత్న, జిల్లా అధ్యక్షురాలు యు. మరియమ్మ, జిల్లా కోశాధికారి సి. అమ్ములు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏపీ ఆశా వర్కర్స్ నాయకులు

పేదల సొంతింటి కల నెరవేర్చాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కూటమి ప్రభుత్వం అధికారం రాగానే పేదలందరికి పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారని, కానీ అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా ఇంతవరకు అతీగతీ లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర ప్రశ్నించారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాంతాలలో సొంత ఇండ్లు లేక బాడుగ ఇండ్లలో ఉండలేక ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు ఉంటూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పేదల సొంతింటి కల సాకారం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం ద్వారా పట్టణ ప్రాంతాలలో ఇంటి స్థలం కలిగి ఉన్నవారు ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇండ్లు మంజూరు చేస్తే ఇంటి నిర్మాణం చేసుకోవాలన్న ఆశలతో ఎదురుచూస్తున్నారన్నారు. ఇదో చేస్తాం అదో ఇస్తాం డిసెంబర్ లో చేస్తాం మార్చిలో చేస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారు తప్ప నేటికీ మంజూరు చేయలేదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె సి బాదుల్లా, నగర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యమాత మహోత్సవాలను జయప్రదం చేయాలి



మహోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎండీ ప్రసాద్ రావు, కమిటీ సభ్యులు, పాస్టర్లు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఈ నెల 29వ తేదీ నుంచి నిర్వహించనున్న కడప వేలాంగని ఆరోగ్యమాత తిరుణాల మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంస్థ డైరెక్టర్ ఎండీ ప్రసాద్ రావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం రైల్వే స్టేషన్ రోడ్డు లోని ఆరోగ్యమాత మందిరంలో తిరుణాల మహోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ఆరోగ్యమాత తిరుణాల కడప పీఠాధిపతులు సగినాల పాల్ ప్రకాశ్ చేత పతాకావిష్కరణాన్ని చేయనున్నామన్నారు. ప్రతి రోజు సాయంత్రం 5.30 గంటల నుంచి ఈ తిరుణాల మహోత్సవాలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సెప్టెంబర్ 8న సోమవారం ఉదయం 8.30 గంటలకు విశాఖపట్నం అగ్రపీఠం విశ్రాంత పీఠాధిపతులు మల్లవరపు ప్రకాష్‌చే మహోత్సవ సమిష్టి దివ్యబలి పూజ నిర్వహిస్తామన్నారు. ఈ తిరుణాల మహోత్సవాలను భక్తులు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీన్ జోసెఫ్‌బాబు, జ్వరేనేష్, కమిటీ ప్రెసిడెంట్ విక్టర్, సెక్రటరీ సెబాస్టియన్, ట్రెజరర్ ఆనందరావు, విజయ్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్ఠించిన ఆంజనేయ స్వామి విగ్రహం

పెండ్లిమర్రి : మండలంలోని రేపల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఆభయ అంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట వేడుకలు శుక్రవారం ఆలయ కార్యనిర్వాహకుల సమక్ష్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి గణపతి పూజ, ఆకుపూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే బండలాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన ఎద్దుల యాజమానులకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో మాజీ ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథ్‌శర్మలు పాల్గొన్నారు.

ప్రైవేట్ హాస్పిటల్స్‌లో తనిఖీలు



ప్రైవేట్ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్‌లో వైద్యాధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం హాస్పిటల్స్ నడుస్తున్నాయా లేదా అని పరిశీలించారు. ఫైర్, బయో మెడికల్ వేస్టేజ్, పొల్యూషన్‌లకు కాలపరిమితి, హాస్పిటల్స్‌కు వచ్చిన రోగుల వసతి, వార్డులు, వాష్ రూమ్‌లు, మంచి నీటి వసతి, రికార్డుల నిర్వహణ తదితర వాటిని పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, ప్రతి ప్రైవేట్ హాస్పిటల్ తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని డాక్టర్ గీత హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలోని వివిధ చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరించడంతో పాటు వారికి ప్రత్యేకంగా రుణాలు మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.బాలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన చేతివృత్తిదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేతివృత్తిదారులకు ఇళ్ళ స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ నెల 23న ఒంగోలులో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున వృత్తిదారులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చేతివృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు పి.నాగరాజు, సీపీఐ రూరల్ కార్యదర్శి ఇమ్మానియేల్, చేతివృత్తిదారుల సంఘం కన్వీనర్ వెంకటరామయ్య, కో కన్వీనర్లు శివప్రసాద్‌రెడ్డి, బాలసుబ్బయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి

ప్రొద్దుటూరు : కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పంచాయతీలకు విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల పంచాయతీల్లో అభివృద్ధి పడకేసిందన్నారు. ఎన్నో ఆశలతో గ్రామాల్లో అభివృద్ధి చేద్దామనే ఉత్సాహంతో ఎన్నికైన సర్పంచ్‌లకు నిధులు లేక, ప్రభుత్వ ప్రోత్సాహం లేక అభివృద్ధి కార్యక్రమాలను నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. 15వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులను విద్యుత్ బకాయిల పేరుతో దారిమళ్లించాలనుకోవడం దురదృష్టకరమన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వి.అన్వేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం



ప్రమాదానికి గురైన కారు

చింతకొమ్మదిన్నె : కడప–చిత్తూరు జాతీయ రహదారిపై చింతకొమ్మదిన్నె మండలం లింగారెడ్డిపల్లె క్రాస్ వద్ద శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. అడ్డుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి కారు (ఏపీ39 హెచ్‌ఎఫ్ 9971) అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని రోడ్డు దాటి 10 అడుగుల తగ్గులో ఉన్న పొలంలో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు, కారులోని నలుగురికి చిన్న గాయాలతో బయటపడ్డారు.